ప్రజాశక్తి
మంగళవారం 20 డిసెంబరు 2022 5
శ్రీకాకుళం



రేపట్నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 21 నుంచి జనవరి రెండో తేదీ వరకు హైకోర్టు నిర్వహిస్తున్న స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినేర్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే హాజరు కావాలన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఫొటో క్లారిటీ ఉన్న గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని స్పష్టం చేశారు. అభ్యర్థులకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఈనెల 16వ తేదీ నుంచి నెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బదిలీల ప్రక్రియ గందరగోళం

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. బదిలీలపై ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో రోజుకొక సవరణలు చేస్తూ ఆదేశాలను వెలువరిస్తుండడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ప్రశాంతంగా ఉన్న వారు ప్రభుత్వం నుంచి వస్తున్న కొత్త ఆదేశాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. విద్యాశాఖ, ఉపాధ్యాయ సంఘాల నాయకులను సంప్రదిస్తూ పాత వాటిని రద్దు చేసుకుని, కొత్తగా దరఖాస్తులను సమర్పిస్తున్నారు. ఆలోచన వచ్చిన వెంటనే ఉత్తర్వులు జారీ చేయడమే తప్ప బదిలీల మార్గదర్శకాలపై సరిగ్గా కసరత్తు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



- ఉత్తర్వులపై రోజుకో సవరణ
- ఒకసారి అవునని, మరోసారి కాదని నిర్ణయాలు
- దరఖాస్తుల సమర్పణలో నానాపాట్లు పడుతున్న ఉపాధ్యాయులు
- ఇప్పటివరకు 3,359 దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తుల సమర్పణకు 17వ తేదీని గడువుగా ప్రకటించింది. తొలుత 18వ తేదీ, ఆ తర్వాత 19వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈనెల 18వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 3,359 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాల వారీగా ఖాళీల వివరాలను ఇప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. రేషనలైజేషన్‌తో రద్దయిన పోస్టుల వివరాల సేకరణ పనీ జరగలేదు. వెబ్ ఆప్షన్ కోసం తొలుత 24వ తేదీని గడువుగా ప్రకటించినా, బదిలీలపై ప్రభుత్వం రోజుకో నిర్ణయం వెలువరించడంతో దాన్నీ ఈనెల 27వ తేదీ వరకు పొడించారు.

ఒకసారి అవునని, తర్వాత కాదని...

బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల పదో తేదీన 187 జిఒను విడుదల చేసింది. వారం రోజుల వ్యవధిలో అనేక మార్పులు చేయడంతో, ఉపాధ్యాయుల్లో గందరగోళానికి దారితీస్తోంది. రేషనలైజేషన్‌కు సంబంధించి మ్యాపింగ్ అయిన వాళ్లకు మాత్రమే రేషనలైజేషన్, ఓల్డ్ స్టేషన్ పాయింట్లు వర్తిస్తాయని ఒకసారి, రేషనలైజేషన్ ఎనిమిదేళ్లు లోపు జరిగితే అందరికీ వర్తిసాయని మరోసారి చెప్తోంది. తాజాగా సోమవారం డిఇఒలతో నిర్వహించిన సమావేశంలో 2020లో బదిలీ అయి మ్యాపింగ్‌తో సంబంధం లేకుండా రేషనలైజేషన్ కాబడిన వారికి రేషన్‌లైజేషన్, ఓల్డ్ స్టేషన్ పాయింట్లు వరిస్తాయని చెప్తూనే జూనియర్లకు మాత్రమే అవకాశం ఉంటుందని మార్గదర్శకాలు ఇచ్చింది. గందరగోళానికి గురైన జూనియర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి నెట్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. 2012 అడహక్ ఉద్యోగోన్నతులు పొందిన వారిని వారి పాత స్థానాల్లో కొనసాగించాలని న్యాయస్థానం తీర్పునిచ్చిన నేపథ్యంలో వారంతా దరఖాస్తు చేయలేదు. అటువంటి ఉపాధ్యాయులకు సంబంధించి తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సమర్పించేలా చూడాలంటూ ఇప్పుడు ఎంఇఒ, హెచ్ఎంలు ఆదేశాలు ఇస్తున్నారు. లాంగ్వేజ్ పండిట్లుగా పనిచేస్తున్న వారు 2020లో రేషనలైజేషన్ కాబడిన 17 మంది ఉపాధ్యాయులు పలు పాఠశాలల్లో పనిచేస్తున్నారు. తొలుత వారికి బదిలీల నుంచి మినహాయింపునిచ్చి, ఇప్పుడు వారూ దరఖాస్తు చేసుకోవాలని చెప్తున్నారు. ఇప్పుడు వారు పనిచేస్తున్న పాఠశాలకు లాంగ్వేజ్ పండిట్ల పోస్టులను మంజూరు చేసి, వారిని అక్కడ నుంచి పంపేయాలని నిర్ణయించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గతానికి భిన్నంగా బదిలీలపై అసంతృప్తి

గతంలో జరిగిన ప్రతి బదిలీల్లో రేషనలైజేషన్ జరిగే సందర్భంలో ఎనిమిదేళ్లు నిండకపోతే ఆ ఉపాధ్యాయుడు వాడిన అన్ని సౌకర్యాలు రేషనలైజేషన్, ప్రిఫరెన్స్ కేటగిరీ అవకాశాలు ఉండేవి. ఈసారి అందుకు భిన్నంగా బదిలీల్లో 2015, 2017లో చేరి ప్రస్తుతం రేషన్‌లైజేషన్ కాబడిన ఉపాధ్యాయులకు ఆ అవకాశం తొలగించడంతో నష్టపోతున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రాలను అందజేశారు. అదేవిధంగా ఈ ఏడాది మేలో చేపట్టిన అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన వారు ఆరు నెలలు గడవక ముందే రేషనలైజేషన్ కాబడడంతో, పాత స్టేషన్ పాయింట్లు మంజూరు కాక సుదూర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తోందన్న ఆవేదన వారిలో కనిపిస్తోంది.

బదిలీల్లో న్యాయం చేయాలి



2015, 2017ల్లో స్పౌజ్, ప్రిఫరెన్స్ కేటగిరీల్లో బదిలీ అయి ఎనిమిదేళ్లు కాకముందే రేషనలైజన్‌కు గురైన వారికి వారు గతంలో వినియోగించుకున్న ఆయా కేటగిరీలను వర్తింపజేయాలి. 17 మంది లాంగ్వేజ్ పండిట్లలో కోరుకున్న వారికి అదే స్థానంలో కొనసాగించాలి. అంతర్ జిల్లా బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

\- ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యుటిఎఫ్

బ్లాక్ చేయకుండా ఖాళీలన్నీ చూపాలి



బదిలీల్లో భాగంగా పోస్టులను బ్లాక్ చేయకుండా ఖాళీలన్నీ చూపాలి. హేతుబద్ధీకరణకు గురైన వారికి రేషన్‌లైజేషన్, స్పౌజ్ పాయింట్లను వర్తింపజేయాలి. రోజుకొక సవరణలు వస్తున్న నేపథ్యంలో బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలి.

\- జి.మధుసూదనరావు, జిల్లా అధ్యక్షులు, ఎస్‌టియు

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలు



ప్రభుత్వం ఎప్పటికప్పుడు వెలువరిస్తున్న మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను చేపడుతున్నాం. ఖాళీలను గుర్తించే పని చేస్తున్నాం. రేషనలైజేషన్‌తో రద్దయిన పోస్టుల వివరాలనూ సేకరించే పనిలో ఉన్నాం. ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా బదిలీలపై వస్తున్న మార్పులను తెలియజేస్తున్నాం.

\- జి.పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

క్షయ రోగులు ఎంతమంది?

- జిల్లాలో నేటి నుంచి సర్వే
- పది గ్రామాలు ఎంపిక
- లక్ష మందికి కెల్ల వైద్య పరీక్షలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్షయ వ్యాధి (టిబి) నియంత్రించేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. పీడితులను గుర్తించడంలో ఆలస్యమైతే వారి నుంచి ఇతరులకు విస్తరించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రోగ పీడితులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. కేంద్ర వైద్యారోగ్యశాఖ, మానవ వనరుల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక సర్వే చేపట్టేందుకు నిర్ణయించాయి. ఇందులో భాగంగా బుధవారం నుంచి జిల్లాలో సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లా క్షయ నివారణ సంస్థ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ప్రస్తుతం 1840 కేసులు ఉన్నాయి. గతంలో లక్ష మందికి 220 కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం లక్షకు 120 కేసులు నమోదవుతున్నాయి.

సర్వే చేపట్టేది ఇలా...

జిల్లాలో క్షయపై సర్వే చేసేందుకు 10 గ్రామాలను ఎంపిక చేశారు. ప్రతి గ్రామంలో రెండు వేల మందిని సర్వే చేస్తారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితులను గుర్తించి వారి నుంచి కెల్ల సేకరణ చేపట్టి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల ద్వారా బాధితులను గుర్తిస్తారు. ఇంకెవరికైనా క్షయ రోగం సోకి ఇంతవరకు ఎటువంటి పరీక్షలు చేయించుకోకుండా ఇంటి వద్దే ఉంటున్న వారిని, హెచ్ఐవి సోకి ఆపై టిబితో బాధపడుతున్న వారిని గుర్తిస్తారు. గ్రామంలో 30 కేసులు నమోదు కాకపోతే సురక్షిత గ్రామంగా గుర్తించి పక్కన ఉన్న గ్రామంలో సర్వే చేపడతారు. ఇలా లక్ష మందికి పరీక్షలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. వాస్తవంగా ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అందుకు ఈ వ్యాధి పీడితులు ఉన్న చోట చుట్టుపక్కల వారందరికి పరీక్షలు చేస్తారు. క్షయ ఎక్కువగా హెచ్ఐవి, కిడ్నీ, సుగర్ వ్యాధి బాధితులకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. వీరిలో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండడమే అందుకు కారణం. జిల్లాలో ఇటువంటి వారు సుమారు 30 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో కిడ్నీ రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. అందువల్ల ఈ రోగులను, ఈ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్షలు చేస్తారు. వ్యాధి సోకితే క్రమం తప్పకుండా వైద్యం చేయించుకుని మందులు వాడాల్సి ఉంటుంది. పౌష్టికాహారం తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. డాట్స్ వారీగా మందులను ఎప్పటికప్పుడు మారుస్తుంటారు. ఎవరైనా సకాలంలో మందులు వేసుకోకుండా ఉంటే ఈ వ్యాధి ఇంట్లో ఉన్న వారితో సహా చుట్టు పక్కల ఉన్న వారికి వ్యాపించే ప్రమాదం ఉంది.

దాతల సాయం కోసం...

క్షయ పీడితులకు పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ఆరు నెలల పాటు కేంద్ర ప్రభుత్వం మందులతో పాటు రూ.500 అందిస్తోంది. మరింత పౌష్టికారం అందించేందుకు వీలుగా జిల్లా అధికారులు దాతల సహకారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రెడ్‌క్రాస్ నేతృత్వాన ఇప్పటికే జిల్లాలోని కొంతమంది బాధితులకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచనల మేరకు పౌష్టికాహారం అందిస్తున్నారు. కిట్‌ల రూపంలో వీటిని అందిస్తున్నారు. రోగులను దత్తత తీసుకుని మందులు, పౌష్టికాహారం అందించేందుకు అరబిందో ఫౌండేషన్ ముందుకొచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో బాగంగా సాయం అందిస్తోంది. జిల్లాలో ఇప్పటికే దాతల నుంచి రూ.46 లక్షలను సేకరించారు. దాతలు ముందుకు రావాలన్న కలెక్టర్ పిలుపుతో ఇప్పటికే వరం ఆటో షోరూం, అరబిందో ఫౌండేషన్ వంటి సంస్థలు ముందుకొచ్చాయి. మరింత మంది దాతలు ముందుకొస్తే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న రోగులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఎంపిక చేసిన గ్రామాలు

జిల్లాలో సర్వే చేపట్టే పది గ్రామాలను ఎంపిక చేశారు. బలగ, లోహరిబంద, పలాస-కాశీబుగ్గ, శ్యామసుందరాపురం, శివరాంపురం, ఇరపాడు, హనుమంతుపురం, సింగుపురం, ఎచ్చెర్ల, సంచాం గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి ఎన్.అనురాధ తెలిపారు.

జిజిఎంపి పనుల్లో జాప్యం వద్దు

- జగనన్న కాలనీల్లో జెజెఎం అమలు కావాలి
- పూర్తయిన గృహాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న కలెక్టరు శ్రీకేష్ లాఠకర్

గడప గడపకు మన ప్రభుత్వం కింద జిల్లాలో మంజూరు చేసిన పనుల్లో జాప్యం వద్దని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మండల అధికారులను ఆదేశించారు. రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, ధాన్యం సేకరణ, ఇళ్ల నిర్మాణ స్థలాల పంపిణీ, గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రారంభమైన పనులు, ప్రాధాన్యతా భవనాలు, జల్ జీవన్ మిషన్, గృహ నిర్మాణాలు, నాడు-నేడు, స్పందన తదితర అంశాల ప్రగతిపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు జిజిఎంపి కార్యక్రమం కింద 1,125 పనులను మంజూరు చేయగా, 108 పనులు ప్రారంభం కాలేదన్నారు. వాటిని తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి నెలలో జరిగిన పర్యటనలో మంజూరు చేసిన జిజిఎంపి పనులు వచ్చే నెల ముగింపు నాటికి ప్రారంభం కావాల్సిందేనని తేల్చిచెప్పారు.

ప్రాధాన్యతా భవనాల్లో 401 భవనాలు పునాదుల స్థాయిలోనే ఉన్నాయని, అందులో 182 హెల్త్ క్లినిక్స్, 174 రైతుభరోసా కేంద్రాలు, 45 గ్రామ సచివాలయాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో సిమెంట్, స్టీల్‌కు కొరత లేదన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆయా ఏజెన్సీలతో మాట్లాడి ఐదు రోజుల్లోగా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీటి పైపులైన్లు జల్ జీవన్ మిషన్ కింద వేయాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన గృహాల్లో చాలావరకు తాగునీటి కనెక్షన్లు లేవని, వాటికీ జెజెఎం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ కాంప్లెక్స్ కింద జిల్లాలో 536 స్థలాలను గుర్తించామని, అందులో 304 పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో ఐదు లక్షల మంది విద్యార్థులకు రూ.600 కోట్ల విలువ గల ట్యాబ్‌లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తొలి విడతగా 7,800 ట్యాబ్‌లు వచ్చాయని, వాటిని ఈనెల 21 నుంచి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రెండో విడత నాడు-నేడు పనులు వేగవంతం కావాలని, రివాల్వింగ్ ఫండ్ వచ్చిన వారందరూ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని, పెండింగ్‌లో ఉన్న గృహాలను ప్రారంభించాలని చెప్పారు. గృహ నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

అవసరమైన రోవర్స్ ఇచ్చినా రీ సర్వే వేగవంతం కాకపోవడంపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో 50 శాతం మాత్రమే ఇకెవైసి పూర్తయిందని, రీ సర్వే పూర్తి చేసి పత్రాలు ఇచ్చిన వాటిలోనూ ఇటువంటివి ఉన్నాయన్నారు. రీ సర్వే పూర్తి చేసిన వాటి వివరాలు రోజు వారీ ప్రగతి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్టోన్ ప్లాంటేషన్ కింద 171 గ్రామాలకు 65 వేల స్టోన్స్ ఇచ్చామని, వాటిని గ్రామాల్లో సగం వరకు ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు.

ఒక గ్రామంలో స్టోన్ ప్లాంటేషన్ శత శాతం పూర్తయ్యాకే వేరే గ్రామంలో ప్రారంభించాలని సూచించారు. మ్యుటేషన్లు, స్పందన తదితర అంశాలపై సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. కాన్ఫరెన్స్‌లో సిపిఒ వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, భూ రికార్డులు, సర్వే శాఖ ఎడి కె.ప్రభాకరరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు డి.వి విద్యాసాగర్, ఎన్.గణపతిరావు, పలు శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



వినతిపత్రం అందజేస్తున్న తేజేశ్వరరావు

టెక్కలి సమగ్ర రక్షిత మంచి నీటి సరఫరా పథకం సిబ్బందికి ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా టెక్కలి సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో పంపు ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లుగా థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నేటి వరకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. గత కాంట్రాక్టర్ ఐదు నెలల జీతం చెల్లించాలని, నెలకు రూ.10 వేలు చొప్పున బిల్లులతో సంబంధం లేకుండా గతంలో వేతనాలు చెల్లించేవారని చెప్పారు. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. ప్రాజెక్టు వద్ద గల ట్యాంకుల క్లీనింగ్, పైపులైన్ మరమ్మతులు చేస్తున్నా చెల్లింపులు చేయడం లేదని చెప్పారు. కొత్త కాంట్రాక్టర్ మూడు నెలల్లో ఇంతవరకు ఒక్క నెల జీతం ఇవ్వలేదన్నారు. బిల్లులు వస్తే తప్ప జీతాలు ఇవ్వలేనని చెప్తున్నారని తెలిపారు. ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను పోషించుకోవడానికి చివరకు అప్పు దొరకని పరిస్థితి ఉందన్నారు. నెల జీతంపైనే ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలన్నారు. టెక్కలి డివిజన్ ఇంజినీరింగ్ అధికారులకు విన్నవించుకున్నా నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. టెక్కలి డివిజన్ కేంద్రంతో పాటు 24 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న పథకం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టెక్కలి సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం కార్మికులు వి.ధర్మారావు, కె.శ్రీను, ఎన్.ఉమేష్, ఎం.సురేష్, బి.సంతోష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న వికలాంగుల జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, వికలాంగుల సంక్షేమశాఖ, యూత్ ఫర్ జాబ్స్ సంయుక్తంగా ఈనెల 20న వికలాంగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి ఎం.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగ స్త్రీ, పురుష అభ్యర్థులకు పలు కంపెనీల్లో ఉద్యోగ కల్పనలో భాగంగా నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్రంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు గల అభ్యర్థులు హాజరు కావచ్చని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనంతో ఉపాధి కల్పించబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9542205294 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

నేడు ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.బాబు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటరు నమోదు అధికారులు, సహాయ అధికారులతో సమీక్షించనున్నారని పేర్కొన్నారు. 9.45 గంటలకు పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఎటువంటి అభ్యంతరాలు, సూచనలున్నా ababu@ias.nic.in మెయిల్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు.

శాస్త్రీయ పరిశోధనలు అవసరం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజంలో శాస్త్రీయ పరిశోధనలు ఎంతో అవసరమని కలెక్టర్ శ్రీకేష్ లాటకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిఎస్‌టి సౌజన్యంతో ఏడు రోజుల పాటు నిర్వహించే కార్యశాలను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని, రీచ్ టు అండ్ అన్‌రీచ్ ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యశాల విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో సెల్ టవర్స్ నిర్మాణం వల్ల ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు రేడియేషన్ బారిన పడుతన్నారని అన్నారు. దీనిపై శాస్త్రీయ పరిశోధన అవసరమన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో కొందరు గిరిజనులు ఎనీమియా బారిన పడుతున్నారని, మాత్రలను అవగాహన లేక తీసుకోవడం లేదన్నారు. కరోనా సమయంలో వ్యాక్సిన్ తీసుకోవడానికి ఎంతో మంది వ్యతిరేకత చూపించారని, ఇలాంటి వాటిపై మరింత విస్తృతంగా పరిశోధనలు చేసి, వారిని మేల్కొలపాలన్నారు. ఐఎస్‌సి బెంగళూరు నుండి హాజరైన ప్రొఫెసర్ పాటూరి కొండయ్య, ముఖ్యవక్తగా హాజరైన ఫైబ్రోసిస్ క్యాన్సర్ పై జరుగుతున్న పరిశోధనలపై అవగహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను వారు సత్కరించారు. కార్యక్రమంలో 25 మంది డెలిగేట్స్‌తో పాటు కళాశాల ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ శాంతిదేవి, వర్కుషాపు కో-ఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, కన్వీనర్ ఎం.ప్రదీప్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అక్రమాలు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు టిడిపి ఫిర్యాదు
- 'స్పందన'కు 156 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



కలెక్టర్‌కు వివరిస్తున్న కూన రవికుమార్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచుకున్నాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 156 వినతులు వచ్చాయి. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఓటర్ల జాబితాలో అక్రమాలపై వినతిపత్రం అందించారు. కొందరు ఎలక్టోరల్ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇతరుల ఆరు వేల దరఖాస్తులను పక్కన పెట్టేశారని తెలిపారు. సుమారు వెయ్యి మంది డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు చేశారని చెప్పారు. గత నెలలో విడుదల చేసిన ముసాయిదా జాబితాలో అనేక అక్రమాలు బయటపడ్డాయన్నారు. అనర్హులకు ఓటు హక్కు కల్పించారని ఆధారాలతో కూడిన పత్రాలను అందజేశారు. నిరక్షరాస్యులు, మూడో తరగతి, ఐదో తరగతి, టెన్త్, ఇంటర్ చదివిన వారినీ ఓటర్లుగా నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. 2019 అక్టోబరు 31 తర్వాత డిగ్రీ పూర్తి చేసిన అనేక మంది పేర్లు జాబితాలో పొందుపరచలేదన్నారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరిదిద్దాలని కోరారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతిని అందించిన వారిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్ని లక్ష్మి పలువురు టిడిపి నాయకులు ఉన్నారు. ఇటీవలి కాలంలో పెద్దఎత్తున వికలాంగుల పెన్షన్లు తొలగిస్తున్నారని, అంగవైకల్యంతో బాధపడుతున్న వారిపై వివక్షత తగదని వికలాంగుల సంఘం ప్రతినిధి యాళ్ల రామారావు వినతిపత్రం అందించారు. పేర్కొన్నారు. గతంలో వచ్చిన పెన్షన్ గతేడాది జులై నుంచి ఆగిపోయిందని టెక్కలి మండలం గూడెంకు చెందిన మానసిక వికలాంగురాలు మన్నెల రోజ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఎల్ఎన్‌పేట, పలాస, సారవకోట మండలాలకు చెందిన పలువురు వికలాంగులు తమ పెన్షన్లు నిలిపివేశారని ఫిర్యాదు చేశారు. రబీ సాగుకు అనుకూల పరిస్థితులున్నా, ఇంతవరకు అపరాల విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో ఇవ్వడం లేదని టెక్కలి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, అందువల్ల సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని మహేంద్ర రైతుసంఘం ప్రతినిధి కొర్ల హేమారావు చౌదరి కోరారు.

స్పందనలో వచ్చిన ఏ ఒక్క వినతీ రీ ఓపెన్ కాకుండా, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. వినతుల పరిష్కారంలో జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత కాల వ్యవధిలోనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌త్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, ఉప కలెక్టర్ జయదేవి వినతులు స్వీకరించారు. అనంతరం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యాన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ ఎన్.అనురాధ, డిసిహెచ్ఎస్ జె.భాస్కరరావు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, డిఇఒ జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఆదిత్య నిలయం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ విరమణ తర్వాత సమాజ సేవలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో భారతీయ స్టేట్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆదిత్య నిలయం భవనాన్ని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, చీఫ్ జనరల్ మేనేజర్ సిహెచ్.నరసింహారావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన వారంతా విధినిర్వహణలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఈ ప్రాంతంపై వాత్సల్యాన్ని పెంచుకున్న వారేనన్నారు. ప్రత్యేకంగా రెడ్‌క్రాస్ సేవల్లో భాగస్వాములు కావడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పి.వి.ఆర్.ఎం.పట్నాయక్, సిహెచ్.బాపయ్యపంతులు, వి.ఎన్.సాహు, కె.వెంకటరమణ, యు.వీర్రాజు, వి.ఎస్.పి.బ్రహ్మ, సిటీజన్ అసోసియేషన్ సీనియర్ సభ్యులు కె.సోమసుందరరావు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

స్పందన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండరాదు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కరించాలని, ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి 27 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ తగదాలకు సంబంధించినవి రెండు, ఆస్తి తగాదాలు పది, సివిల్ అంశాలు రెండు, పాత ఫిర్యాదులు ఆరు, ఇతర అంశాలపై నాలుగు, చిటింగ్ మూడు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను ఫోన్ కాల్ ద్వారా తెలియజేశారు. చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఈ ఫిర్యాదులపై జిల్లా పోలీస్ కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎస్.వాసుదేవ్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడా సంబరాలు

ప్రజాశక్తి- రణస్థలం

క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జన్మదినోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ముందుగా వాలీబాల్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటలను పీడీ ఆడించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పైడి శ్రీనివాసరావు, పైడిభీమవరం సొసైటీ చైర్మన్ గొర్లె తిరుపతినాయుడు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశరావు, జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, ఎంపిటిసి పచ్చిగుళ్ల సాయిరాం పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : సిఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో వైసిపి ఆధ్వర్యాన క్రీడా సంబరాలను నిర్వహించారు. శాంతినగర్ ఇండోర్ బాడ్మింటన్ స్టేడియంలో అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలు (సింగిల్స్, డబుల్స్), మెన్స్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి


రణస్థలం : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నాయకులు శిమ్మ రాజశేఖర్, నక్క రామరాజు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, మెంటాడ స్వరూప్, పాల్గొన్నారు. అలాగే టౌన్ హాల్‌లో చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యాన షటిల్, చెస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అంధవరపు సూరిబాబు, అంబటి శ్రీనివాసరావు, మెంటాడ స్వరూప్, అంధవరపు సంతోష్, మండవిల్లి రవి, పొన్నాడ రుషి, సుంకరి కృష్ణ పాల్గొన్నారు.

నందిగాం: సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైసిపి ఆధ్వర్యాన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు నిర్వహించిన ఈ క్రీడా పోటీలను ఎపి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ సిఎం విద్యాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని, విద్యార్థులంటే ఆయనకు అమితమైన ప్రేమని అన్నారు. తన పుట్టినరోజున ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారని అన్నారు. ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను చూపించి ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన నందిగాం, కవిటి అగ్రహారం విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, బాలికల విభాగంలో లఖిదాసుపురం, నందిగాం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, వైస్ ఎంపిపి కూర్మారావు, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, వైసిపి మండల అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థులు ఒక్క చదువులోనే కాకుండా ఆటలు, పాటలతో పాటు అన్ని రంగాల్లోనూ ముందుండాలని మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా సోమవారం కెజిబివి విద్యార్థినులకు ఆటల పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ గోవిందరావు, కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్, వైసిపి నాయకులు నేతింటి సింహాచలం, సింగుపురం వినోద్, పిట్ట శ్రీనివాసరావు, హనుమంతు గోవిందరావు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : కుర్చీలాట ఆడుతున్న బాలికలు


నందిగాం : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తిలక్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యతపై విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ సోమవారం కళాకారులు కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిజివిబి బ్యాంకు ద్వారా అందజేస్తున్న సేవలను, బంగారంపై రుణాలు, ఇన్స్యూరెన్స్ సేవలు, సైబర్ మోసాలపై కళాజాతా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు విభూతి ఉపేంద్ర, యడవల్లి చిరంజీవి, బ్యాంకు మిత్ర కె.లక్ష్మి, విఒ ఎ.ఆదిలక్ష్మి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

ఈ కమిషనర్ మాకొద్దు

చైర్మన్ గిరిబాబుకు మున్సిపల్ అధికారుల వినతి

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపల్ కమిషనర్ తీరు బాగులేదని, తోటి మున్సిపల్ అధికారులను చిన్నచూపు చూస్తున్నారని, ఉద్యోగులకు ఇబ్బందులు గురి చేస్తున్నారని, ఇటువంటి కమిషనర్ మాకు వద్దు అంటూ మున్సిపల్ అధికారులు పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వద్ద మొరపెట్టుకున్నారు. పలాస మున్సిపల్ చైర్మన్ నివాసం వద్ద గిరిబాబును మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కమిషనరే కారణమని, కమిషనర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై కూడా కమిషనర్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, జీతాలు సైతం నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో పని చేయించుకోవాలే తప్ప ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫెట్స్‌ను కమిషనర్‌రు అడ్డుకుంటున్నారని అన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో అధ్యక్షులు పి.మోనిషా, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వై.అప్పలస్వామి, జి.యశోద, పి.మోహనరావు, ఎం.రూపవతి, సిహెచ్‌వి గుప్తా, బివి రమణ, ఎన్.ఉమా మహేశ్వరరావు, టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


గిరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ అధికారులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గుగ్గిలి పంచాయతీలో రూ.10 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల రీ సర్వే పూర్తయిన గుగ్గలి, గుండువలస, కరవంజ గ్రామాలకు చెందిన రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి వాన గోపి, జెడ్‌పిటిసి మెండ విజయశాంతి, వైసిపి మండల కన్వీనర్ శ్యామలరావు, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు, పైడి విఠల్‌రావు, జుత్తు నేతాజీ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న లవరాజు

సాయిరాంకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిరంతరాయంగా కృషి చేస్తున్న ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా హనుమంతు సాయిరాం ఐదోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయిరాంను జిల్లా నీటి యాజమాన్యం సంస్థ సిబ్బంది సోమవారం దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డ్వామా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ అధికారి బి.లవరాజు, కార్యాలయ సిబ్బంది సాయిరాంనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఐదోసారి జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ వారి ఆనందాన్ని వెలిబుచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సురేష్, శ్రావణ్‌కుమార్, గోవింద్, ఫణి, గిరి, వెంకటరావు, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

చట్టాలపై అవగాహన అవసరం

టెక్కలి: కళాశాలలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని టెక్కలి ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికల హక్కులు, బాల్య వివాహ చట్టంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ మాట్లాడుతూ చదువుతోపాటు పరిసరాలపై అవగాహన కూడా కల్పించుకోవాలని సూచించారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు బి.సతీష్ కుమార్, లుక్‌పాల్, లీలా, పద్మజ, సత్యనారాయణ, బిసాయి, త్రినాథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న తులసీవరప్రసాదరావు

పుస్తకాలు పంపిణీ

కొత్తూరు: సీతంపేట మండలంలోని పులిపుట్టిలో ఉన్న అమ్మ బాలల అనాథ శరణలయంలోని బాలలకు పాతపట్నం నియోజకవర్గం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సిఎం జగన్ పుట్టిన రోజు వారోత్సవాల్లో భాగంగా వీటిని అందజేశామని తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. కోయిలాపు సంజీవురావు, లోతుగెడ్డ ఇందిరరాం, ఎ.ప్రశాంత్ కుమార్, పి.వెంకటకృష్ణ, టి.గోపి పాల్గొన్నారు.


వరికుప్ప దగ్ధం

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ శ్రీరాములు వరి కుప్ప సోమవారం అగ్నికి ఆహుతైంది. 25 సెంట్లలో పండిన వరిని కోత అనంతరం కుప్పలు పెట్టారు. కొండవూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు కుప్ప మాటున బీడి కాల్చి, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని బాధితులు, స్థానికులు తెలిపారు. మూడేళ్లుగా వంశధార నీరు రాకపోయినా కష్టపడి రైతు పండించిన పంట చేతికి అందివచ్చిన వేళ ఇలా ఆహుతి కావడంతో బాధితుడు లబోదిబోమంటున్నారు. సుమారు రూ.8 వేలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. కాశీబుగ్గ అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పారు. ఇతర కుప్పలకు మంటలు వ్యాపించకుండా నివారించడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.


దగ్ధమైన వరికుప్ప

విశ్రాంత సబార్డినేటర్ మృతి

రణస్థలం రూరల్ : రణస్థలం రైతు సేవా సహకార సంఘంలో సబార్డినేటర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పొగరు సూర్యారావు (64) సోమవారం మృతి చెందారు. ఈయన స్వగ్రామం దేరాసాం. ఈయన కళాకారుడు. వృత్తితో పాటు కళారంగంలో మంచి పేరు సంపాదించుకున్నారు. వృత్తి రీత్యా కోష్టలో స్థిరపడ్డారు. ఈయనకు భార్య సూర్యకుమారి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు పొగరు వెంకట కృష్ణబాబు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా సింగపూర్‌లో ఉంటున్నాడు. సూర్యారావు మృతిపై ప్రజాప్రతినిధులు, సహకార సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.


సూర్యారావు (ఫైల్)

సంక్షేమ పథకాలకు చిరునామా జగన్

ఇచ్ఛాపురం: సంక్షేమ పథకాలకు చిరునామా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోమవారం బాలకృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఇంటి వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పచ్చదనం, సుందరీకరణ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ ఎపి చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ డి.లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సుగుణ, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బి.పుష్ప, నారాయణమ్మ, రాజారెడ్డి, కె.మోహనరావు, కాళ్ల నారాయణ, పాపయ్య, ఢిల్లీరావు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న విజయ

మూడు రాజధానులతోనే అభివృద్ధి


అవగాహన కల్పిస్తున్న చింతాడ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస/సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానులు అంశం అందులో పరిపాలన రాజధాని విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మేలు కలుగునున్నదని పరివర్తన ట్రస్టు వ్యవస్థాపకులు, వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస లో మూడు రాజధానులు, పరిపాలన రాజధానిగా విశాఖపట్నం అనే అంశాలపై సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద వచ్చే ఆదాయం అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం చేసి రాజధాని ఏర్పాటు చేస్తే గతంలో హైదరాబాద్ విషయంలో జరిగిన నష్టమే మళ్లీ అమరావతి విషయంలో తలెత్తే ప్రమాదం లేకపోలేదన్నారు. అందుకే సిఎం జగన్ అన్ని ప్రాంతాలూ సమాంతరంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో మూడు రాజధానులు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రాష్ట్రంలో అత్యధికంగా లాభం పొందే జిల్లా శ్రీకాకుళం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో పరివర్తన్ ట్రస్టు సభ్యులు, రొట్టవలస గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పద్మావతి విద్యార్థులకు సంతూర్ స్కాలర్‌షిప్

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు విప్రోకేర్ సంస్థ సంతూర్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేసిందని కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 19 మంది విద్యార్థులకు రూ.24,000 చొప్పున విప్రో సంస్థ నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ఈ స్కాలర్ షిప్‌కు అర్హులని తెలిపారు. ఒక్కసారి స్కాలర్ షిప్‌కు ఎంపికైతే కోర్సు ముగిసే వరకు స్కాలర్‌షిప్‌ను పొందవచ్చని చెప్పారు. స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు ఈ మొత్తాన్ని తమ విద్యా అవసరాలకు వెచ్చించాలని సూచించారు. స్కాలర్‌షిప్ పొందడంపై అధ్యాపకులతో పాటు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.


విద్యార్థులతో డైరెక్టర్ దుర్గాప్రసాద్

కంకర తవ్వకాలపై విచారణ చేయాలని వినతి


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మండపల్లి పంచాయతీ బంజిరి నారాయణపురం కొండ వద్ద అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని, వాటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని టిడిపి మండల నాయకులు డిమాండ్ చేశారు. మాదిన రామారావు, బి.కామేష్‌రెడ్డి, తదితరులు తహశీల్దార్ హైమావతిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొండ చదును పేరుతో కొంతమంది అక్రమంగా కంకర తరలిస్తున్నారని, దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కొండపై కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డ రాంకుమార్, బొడ్డ హరిబాబు, మద్దిల ఆనందరావు, మాదిన ప్రదీప్ పాల్గొన్నారు.

తూకం వేసి బియ్యం ఇప్పించాలి

గోదాం వద్ద డీలర్ల నిరసన

ప్రజాశక్తి- జలుమూరు

పౌర సరఫరాల గోదాం నుండి డీలర్లకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని తూకం వేసి ఇప్పించాలని డీలర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదాం వద్ద డీలర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు గోదాం నుండి తూకం వేసి ఇవ్వకపోయినప్పటికీ మేము ప్రజలకు తూకం వేసి ఖచ్చితంగా ఇవ్వాల్సి వస్తోందని, దీని కారణంగా మాకు సిబిలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రతి నెలా బియ్యం తీసుకునేందుకు డీలర్లు గోదాం వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్లకు లోడ్‌చేసి మా గ్రామాలకు పంపించేస్తున్నారని అన్నారు. దీంతో గోదాం నుండి మాకు ఎంత మేరకు వస్తున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు స్పందించి మాకున్న సిబిలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై డిఎస్ఒకు ఫిర్యాదు చేయనున్నమన్నారు. గోదాం ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ వద్ద ఈ విషయంపై ప్రస్తావించగా గోదాం వద్ద వేబ్రిడ్జి లేకపోవడం వల్ల డీలర్లకు తూకం వేసి ఇవ్వలేకపోతున్నామన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.


గోదాం వద్ద నిరసన తెలుపుతున్న డీలర్లు

జిఒ 52ను రద్దు చేయాలని ర్యాలీ

టెక్కలి: బెంతు ఒరియాలను ఎస్‌టిలో చేర్చవద్దని, ప్రభుత్వం జారీ చేసిన జిఒ 52ను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి ఆదివాసి సేన ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఇందిరాగాంధీ జంక్షన్, కచేరి వీధి, అంబేద్కర్ జంక్షన్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి పాతబస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి నాయకులు బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని సబ్ కలెక్టర్ టి.రాముల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి వరహాల కృష్ణారావు ఉద్యోగ సంఘాల నాయకులు పెద్దింటి నేపాల్, హరిపురం ఆనందరావు, చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కరావు, సవర రాంబాబు, మురారి, అప్పన్న, గేదెల రమణమూర్తి, నాగరాజు, జగ్గారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు


ప్రశంసాపత్రాలను చూపిస్తున్న క్రీడాకారులు

క్రీడాకారుల ప్రతిభ

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13 నుండి 16 వరకు నిర్వహించిన 1వ జోన్ ఆటల(గ్రిగ్స్) పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. బాలురు విభాగం సీనియర్లలో ఖోఖో, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా, బాల్ బ్యాడ్మింటన్‌లో రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ విభాగంలో ఖోఖో, టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా నిలిచారు. జె.ప్రవీణ్‌కుమార్ 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమం, 800 మీటర్ల పరుగులో తృతీయ స్థానం, 4X100 రిలేలో ప్రథమ స్థానం సాధించారు. బాలికలు విభాగం సీనియర్స్‌లో టెన్నికాయిట్‌లో రన్నర్స్‌గా విద్యార్థులు నిలిచారు. బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ పర్వీన ట్రిపుల్ హై జంప్‌లో తతీయ, ఎన్.టీనా డిస్కస్ త్రోలో తృతీయ స్థానం సాధించింది. జూనియర్ విభాగంలో టెన్నికాయిట్‌లో ఎం.జోత్స్న, పి.శ్రావని విన్నర్స్‌గా, భవాని బెహరా షాట్ పుట్, డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం, ఆర్.ప్రేమలత 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ సాధించారని పాఠశాల హెచ్ఎం దల్లి తులసీరావు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, విద్యార్థులను హెచ్ఎం, సిబ్బంది అభినందించారు.

దాసునాయుడు పరామర్శ

ప్రజాశక్తి- నౌపడ

మండలంలోని దండుగోపాలపురం, సంతబొమ్మాళి గ్రామాల్లో పలు కుటుంబాలను తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు సోమవారం పరామర్శించారు. అనంతరం దండు గోపాలపురంలో దగ్ధమైన కుమ్మరి శాలను పరిశీలించారు. యజమాని మాలగం లచ్చయ్యతో మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్‌లు కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, దండుగోపాలపురం మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, దాసురాజు, బెండి అరుణ్ కుమార్, కూచెట్టి భానుప్రకాష్, చల్ల జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.


దగ్ధమైన కుమ్మరిశాలను పరిశీలిస్తున్న దాసునాయుడు


మాట్లాడుతున్న గోవింద్ స్వామి

పిట్ట కొంచెం.. కూత ఘనం

ప్రజాశక్తి- కవిటి

పిట్ట కొంచెం.. కూత ఘనం అన్న సామెతకు నిలువెత్తు నిదర్శనం చలపరాయి చాణిక్య అని సంగీత శిక్షకులు గోవింద్ స్వామి, ఆరంగి వెంకటరావు అన్నారు. విజయవాడలో ఇటీవల జరిగిన కళా ఉత్సవ్‌లో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన చలపరాయి చాణిక్యను, ఆయనకు శిక్షణ ఇచ్చిన తండ్రి చలపరాయి రవి, చిన్నాన్న వినోద్, తాతయ్య ఏకాంబరంను కపాసుకుద్ది గ్రామంలో సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవింద్ స్వామి మాట్లాడుతూ కవిటి మండలం నుంచి ఎంతోమంది కళాకారులు జాతీయ స్థాయిలో సత్తాచాటారని, వారి కోవలోనే పయనిస్తున్న చాణిక్య చిన్నతనంలోనే అద్భుత ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నాడని కొనియాడారు. ముఖ్యంగా కవిటి మండలం అంటేనే కళలకు పుట్టినిల్లని, అందులో ఇటీవలకాలంలో ఎంతోమంది యువ కళాకారులు తమ అద్భుత నైపుణ్యంతో కళలకే వన్నెతెస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రామారావు, ధనుంజయం, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలవాలి



రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని నరసన్నపేట ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పళ్లు, ప్రత్యేక భోజనాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అందించి, వేడుకలను సోమవారం ప్రారంభించారు. ఆస్పత్రిలోని రోగులందరినీ ఆయన పరామర్శించారు. ముఖ్యమంత్రికి మీ ఆశీస్సులు, దీవెనలు అందించాలని, జగనన్న ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని కోరారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సహాయం, మందుల లభ్యత గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, నాయకులు కృష్ణారావు, బి.శంకర్, నరసింహారావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సిఎం 50వ జన్మదినం సందర్భంగా ముందస్తుగా పుట్టిన రోజు వేడుకలను వైసిపి నాయకులు నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో నర్తు రామారావు, శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, దేవరాజ్, పిలక రాజ్యలక్ష్మి, బి.పుష్ప, దేవదాస్‌రెడ్డి, ఉప్పాడ నారాయణమ్మ, దివ్య, సుల్తాన్, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేస్తున్న విజయ, సాయిరాజ్



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

లింగ వివక్షతకు ముగింపు పలకాలి

ప్రజాశక్తి- కొత్తూరు

లింగ వివక్షతకు ముగింపు పలకాలని ఎపిఎం త్రినాథమ్మ అన్నారు. మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యాన కొత్తూరులో సోమవారం ర్యాలీ నిర్వహించి వెలుగు కార్యాలయం వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ పురుషులు వలే మహిళలకూ అన్ని రంగాల్లోనూ సమానంగా చూడాలన్నారు. స్త్రీ, పురుషలను సమానంగా చూసే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. పిల్లలను పెంచే విధానంలో మార్పుతీసుకోవాలని సూచించారు. కుమారులకు, కుమార్తెలకు తల్లిదండ్రులు సమానంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ పి.ఎం.పార్వతి, సిసిలు జనార్ధన, కనకయ్య, అరుణజ్యోతి, గోవిందరావు, చంద్రరావు, ప్రమీల, విఒఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్

ఆర్‌బికెలకు అధిక ప్రాధాన్యం

మెళియాపుట్టి: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తుందని ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య అన్నారు. రబి సీజన్లో వేసిన పంటలకు పంట నమోదును ప్రతి రైతూ చేసుకోవాలని సోమవారం కోరారు. రాగి, ప్రొద్దు తిరుగుడు విత్తనాలు రాయితీపై ఇస్తున్నామని అన్నారు. డ్రోన్స్, ఇతర యంత్ర పరికరాలు ఆర్‌బికెలో గ్రూపు ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు గ్రూప్‌లుగా ఏర్పాడాలని కోరారు. ఆర్‌బికె ప్రాముఖ్యతను, గ్రామ స్థాయిలో అమలు చేస్తున్న పథకాలను గ్రామ వ్యవసాయ సహాయకులు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అలికాన మాధవరావు, ఎస్.సూర్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 22వ వార్డులో సోమవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. వార్డు కౌన్సిలరు కాళ్ల దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో జెమ్స్ వైద్యుల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 215మంది రోగులకు ఉచితంగ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ స్వరూప, డాక్టర్ సాయి రితిస్ రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో కాళ్ల అర్జున, నిత్యానంద పట్నాయక్, నరేంద్రనాథ్ పట్నాయక్, ఏరియా మేనేజర్ శ్రీధర్, పిఆర్‌ఒ సంతోష్, భవాని, చిరంజీవి, అంగన్వాడీ, ఆశలు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

ఆమదాలవలస : మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని పొన్నాంపేట కాలనీలో సర్పంచ్ ప్రతినిధి చల్లా కామేశ్వరరావు ఆధ్వర్యాన పాడైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే అదే పంచాయతీ పరిధిలోని ఆనందపురంలో మరో రెండు తాగునీటి బోర్లను మరమ్మతులు చేయించారు. తాగునీటి బోర్లు గ్రామాల్లో మళ్లీ యథావిధిగా పనిచేస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్ చల్లా ఉషకు కృతజ్ఞతలు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న కామేశ్వరరావు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ కోటీశ్వరరావు తెలిపారు. సోమవారం నరసన్నపేట విద్యుత్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నరసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మ్ మెంటెనెన్స్ వర్కులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయినున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రెండు వేల మందికి అన్నదానం

వజ్రపుకొత్తూరు: పూండి గోవిందపురం గ్రామంలో సోమవారం రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. బ్రహ్మ శ్రీ తెలుకుచేర్ల ప్రసాదరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఏటా అన్నదానం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం శ్రీ రాజరాజేశ్వరి పీఠం ఆవరణంలో అయ్యప్పస్వాముల పడి పూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలను అందజేశారు. కణితి వెంకట భగవాన్, కొంచాడ వెంకటరావు, కె.సందీప్, బోయిన కేశవక్రాంతి, తులసీరావు పాల్గొన్నారు.



కుర్చీలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కుర్చీలు వితరణ

లావేరు : లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్ తరపున పది కుర్చీలు ఉపాధ్యాయులు పి.రాజారావు, ఎం.శ్రీనివాసరావులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల తరపున ఎన్.వి.రమణ మాట్లాడుతూ భవిష్యత్‌లో తమ తరపున మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. టి.శ్రీనివాస్, కె.సంతోష్‌కుమార్, కె.అప్పలస్వామి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఇచ్ఛాపురం: నిబంధనలు అతిక్రమించి పలువురు వాహనాలు నడపుతున్న నేపథ్యంలో రవాణాశాఖ అధికారి హరిప్రసాద్ ఆకస్మికంగా వాహన తనిఖీలు సోమవారం నిర్వహించారు. రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద వివిధ స్కూల్ బస్సులు, వ్యానుల రాకపోకలపై మాటు వేసి, తనిఖీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న 12 వాహనాలపై కేసు నమోదు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పత్రాలను పరిశీలిస్తున్న హరిప్రసాద్

విజేతలకు బహుమతులు



బహుమతిని అందజేస్తున్న సర్పంచ్ సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ఇటీవల గ్రామ సంఘాల స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యాన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసినట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా వంజంగి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు సర్పంచ్ బెండి సత్యవతి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో గెలుపొందిన విజేతలు అందరిని మండలస్థాయి ముగ్గుల పోటీలకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి విజతలను గుర్తించి ఆమదాలవలస ప్రభుత్వ కాలేజీ మైదానంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ముగ్గులు, పాటలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీల్లో పాల్గొనున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్జిగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరించారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి కళ్యాణం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. మార్గశిర బహుళ ఏకాదశిని పురస్కరించుకొని ఈవేడుకలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయబద్ధంగా ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యాన అర్చకులు కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.



కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

8న కళింగ ఆత్మీయ సమ్మేళనం

వజ్రపుకొత్తూరు: పలాస కళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జనవరి 8న చినబాడాం సమీపంలోని మామిడితోటలో కళింగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ సమ్మేళనానికి రావాలని కోరుతూ నగరంపల్లి, గుల్లలపాడు, తాడివాడ, శారదాపురం, వజ్రపుకొత్తూరు, పూండిగల్లి తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించి ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ సందర్భంగా కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు దువ్వాడ జీవితేశ్వరరావు మాట్లాడుతూ సంఘం బలోపేతంలో భాగంగా ప్రతి ఏడాదీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు. కోవిడ్ ఆంక్షలు కారణంగా మూడేళ్లుగా కళింగ ఆత్మీయ సమ్మేళనం నిలిపివేయడం జరిగిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాలు జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు దువ్వాడ హేమబాబుచౌదరి, దువ్వాడ శ్రీకాంత్, చాపర వేణుగోపాల్, దువ్వాడ మధుకేశవరావు, శ్రీహర్ష, బమ్మిడి మోహనరావు, బడ్డ నాగరాజు, దువ్వాడ జయరాం చౌదరి, హెచ్.ఎండుదొర, డి.నిరంజన్, డి.సంతోష్ రాంనాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తం

నందిగాం: విద్యార్థులు డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, లేదంటే నష్టపోతారని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలం అన్నారు. సోమవారం మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఇన్‌ఛార్జి బి.ఎర్రన్నానాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019లో ముఖ్యాంశాలను వినియోగదారుల హక్కులు బాధ్యతలను తెలియజేశారు. కల్తీ, నకిలీ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తప్పనిసరిగా భద్రపరచాలని అన్నారు. వినియోగదారులు నష్టపోయే సమయంలో తగు ఆధారాలతో సత్వర న్యాయం కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటాచలం